# పాటలపిచ్చి

రాము—వయసు సుమారు ఇరవై. కాలేజీలో చదువుతుంటాడు పాటలంటే తగని పిచ్చి.

గోపి—రాము తమ్ముడు, వయసు నాలుగు.

లక్ష్మి—వయసు సుమారు పద్దెనిమిది. రాము భార్య.

విశాలాక్షమ్మ—రాము తల్లి. వయసు సుమారు నలభైఅయిదు.

కాలం—ఒకనాటి రాత్రి

స్థలం—రాము స్టడీరూము.

(గది మధ్యను ఒక టేబుల్ వుంటుంది. దానిమీద ఒకవైపున టేబుల్ లైట్, యింక్ స్టాండ్, అలారం టైంపీస్ వుంటాయి రెండోవైపున ఒక బొత్తిపుస్తకాలు. టేబుల్ ఎదురుగా ఒక కుర్చీ వుంటుంది.)

(తెరలో)

నేను చదువుకోటానికి వెళ్ళుతున్నానే అమ్మా.

(ప్రవేశం రాము)

రాము: (కుర్చీలో కూర్చుని) పతలిక మర్ హై, తిర్ ఖి నజర్ హై, (పాడుతూ మధ్యలో పుస్తకం తెరిచి) *Every body continues in its state of rest or of uniform motion in a straight line unless*...మరలిరావో మనసు లేదో మన కథే మరతువో...(కూనిరాగం తీస్తాడు)... *Every body continues...nues... nues...every body...body*—ఛీ వెధవది! ఎంత చదివినా రాదేం? ఏం చేయాలి? చెప్పకపోతే మాస్టరు తిడతాడు. లేకపోతే క్లాసుకి నెళ్ళను. అమ్మయ్యో వాడెక్కడ టైగర్ వరదాచారిలాగు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేమనిషి! ఫీల్లేదు, వచ్చితీరాలి. (పుస్తకం తెరిచి, ఒకమారు చదివి, మళ్ళీ పుస్తకం మూసి, కండ్లుమూసుకొని, త్వరత్వరగా)...

...*Every body continues in its state of rest...rest which.. is represented both in magnitude and direction*...

(ఆగి పుస్తకం చూచి) అయ్యబాబోయ్ ఒక్కమారే ఇక్కడనుండి *Parallelogram law of velocities* లోకి వెళ్లిపోయాను! ఛ! ఛ! ఎంతకీ రాదు. (బిగ్గరగా) లక్ష్మి...లక్ష్మి...నిన్నే......కాస్తమంచినీళ్లు పట్టుకురా...

రావో నను మరచితివో

చెలినను మరచితివో (పాడుతాడు)

(ప్రవేశం లక్ష్మి మంచినీళ్ల గ్లాసుతో-)

## శ్రీ వి. ఎ. ఎమ్. కౌండిన్య

లక్ష్మి: ఇదిగోండి మంచినీళ్లు తీసుకోండి ఎందుకలా చదువుకోకుండా పొలికేకలు పెడతారు?

రాము: (వినిపించుకోకుండా) హల్లో! లక్ష్మి వచ్చావా? (మంచినీళ్ళు తీసుకుని) తినటానికి ఏమైనా తే లేకపోయావ్ తియ్యగా-

లక్ష్మి: ఏమున్నాయండి ఇంట్లో తియ్యవి తినేందుకు?

రాము: ఏమీలేదూ—లేకపోవడమేమిటి తప్పు తప్పు! పరమాపరాధంపన్నిచ్చుకోవాలి-

లక్ష్మి: (నవ్వుతూ) ఏం ఇచ్చుకోమంటారో చెప్పండి.

రాము:

ప్రేమ మీరాయీ తింటుంటే హాయీ

రావే మిఠారీ రాజాకుమారీ ప్రేమమిఠాయి-

లక్ష్మి: చాల్లెండి సరసాలు ఎవరయినా వింటే నవ్విపోతారు. చదువుకోండి. (అని దూరంగా వెళ్లి ఒకపుస్తకం చూస్తూ నేవెళ్తా నిలబడుతుంది.)

రాము: ఆ! పోతున్నావా?

పోదువో –

ఓ ప్రియతమా –

పయనమయే ప్రియతమ నను మరచి పోకుమా.

లక్ష్మి: (మాటలాడకుండా గ్లాసు తీసుకుని గుమ్మంవైపు నడుస్తుంది.)

రాము: (తల గోక్కుని)

పలుకరాదటే–

పలుకరాదటే చిలుకా పలుకరాదటే

(తెరలోనుండి)

రామూ! ఏమిటా గోల? చదువుకో లక్ష్మి నువ్వొచ్చేసెయ్.

రాము: అబ్బ! చదువుకుంటున్నానే వే!



"రావో నను మరచితివో, చెలినను మరచితివో..."

(ఒక పది నిముషాలు దీక్షగా పుస్తకం చూసి చదువుతాడు ఇంతలో గోపి ఏదో తింటూ నవ్వుకుంటూ వస్తాడు—)

ఆరే! డింగరీ – ఏలరా నవ్వుచుంటివి? నోటిలో ఏమున్నదిరా? చెదరక చెదరక నోరు తెరువుమురా డింభకా – సాహసం కాయరా – దేవి కటాక్షిస్తుంది

(ఈ వింతధోరణికి భయపడి పిల్లవాడు కవ్వున కేక వేసి ఏడుస్తూ పారిపోతాడు. వెనుకనుండి విశాలాక్షమ్మ ప్రవేశం)

రాము: (కళ్లు మూసుకుని) జై! పాతాళ భైరవీ – రక్తనేత్రవు – జ్వాలాజిహ్వవు –

విశా: (నెమ్మదిగా) ఏమిట్రా నీగోల?

రాము: దేవీ! నాకీ పాఠం వచ్చేటట్లు అనుగ్రహించు.

విశా: (బిగ్గరగా) ఒరేయ్! పిచ్చిగాని పట్టిందా ఏమిట్రా. ఏమిటీ ధోరణి? పిలిస్తే పలకవేమిరా? (భుజం పట్టుకుని ఊపుతుంది.)

రాము: (ఉలికిపడి) ఏమిటే నీగోల. చదువుకుంటూంటే. చూడు టైమ్ పదయిందప్పుడే. పోయి పడుకో—

విశా: ఓరి నీయిల్లు బంగారంగానూ. ఇదంతా చదువట్రా (నవ్వుకుంటూ వెళ్తుంది.)

రాము: తస్సదియ్యా! పాఠం వచ్చేటట్టు లేదు. ఇంగ్లీషు చదువుతా. అయినా ఎందుకీ శ్రమంతా? హాయిగా పండుకుని నిద్రపోక (దీపం ఆర్పటానికి చేయిచాచి తలుపు వేపు చూస్తాడు లక్ష్మి ప్రవేశం. తటాలున తలుపుదగ్గరే ఆగుతుంది)

"మాచెన వేలనో ప్రణయ
సుందరి కౌటుక కండ్లలోని ఆ
లోచన లేమిటో హారిణ
లోచని, నీ చిరునవ్వులోని సం
కోచము లెంగుకో కుసుమ
కోమలి, నీ మధురాధరమ్ములో
దాచుకొనంగ నేటికి సు
ధామయసూక్తి కళావిలాసినీ"

లక్ష్మి బాగానేవుంది మీ పాటల పిచ్చి! అయితే వుండండి (తెచ్చిన తమలపాకులు, వక్కలపళ్లెం టేబుల్ మీదవుంచి వెనక్కు వెళ్లి తలుపువద్ద నిలుచుంటుంది)

(తెరలో – బయట సినిమానుంచి తిరిగి వెళుతున్న జనంలోంచి పాట)

తలుపుతీయునంతలోన తత్తరమది ఏలనోయి
తాళుము కృష్ణా, కాస్తసేపు తాళుము కృష్ణా—

రాము. ఏం ఇంకా అక్కడే నిలుచున్నావు? (లక్ష్మివైపు నడుస్తాడు)

(తెరలో)
తలుపుతీయునంతలోన
తత్తరమది ఏలనోయి

లక్ష్మి (నవ్వుతుంది)

రాము (లక్ష్మి భుజంమీద చెయ్యివేసి నవ్వుతూ) ఏడవలేకపోయాను తీయాటప్లుట (కిటూపదం తెలిసి అప్సారి స్తేనా?– (లక్ష్మి తలుపు మూస్తుండగా తెర).

---

కృష్ణదేవరాయలవారి ఆస్థానంలోఉన్న పండితులు అసూయాపరులై, క్రొత్తగా రాజసన్మానానికై వచ్చిన కందుకూరి రుద్రకవిని పరాభవించవలెనని ప్రయత్నం చేశారట. చాలా కఠినమైన దుష్కరప్రాసతో కూడిన సమస్యలను యిచ్చి పూర్తి చేయవలసినదని సవాలు చేశారు. వాటిని అన్నింటిని కందుకూరి రుద్రకవిగారు వెంటనే పూర్తిచేసి పద్యాలు చెప్పారు. అప్పుడు రాయలవారు రుద్రకవికి ఉన్నతాసనం ఇచ్చి సన్మానించారు. అప్పుడు సభలోని అసూయాపరులగు పండితులను గూర్చి సరభసంగా (ఉద్రేకంతో), కొంచెం రసాభాసంగా, ఆ సభావిభవం యిలా వర్ణించాడు:–

ఉ॥ కొందరు పార్థుటెక్కెములు – గొందరు కాలుని వాహనంబులున్
గొందరు భైరవాశ్వములు – గొందరు యీశ్వర వాహనంబులున్
గొందరు కృష్ణజన్మమున – గూసిన ధన్యులు నెంచిచూడగా
నందర కందరే మరియు – నందర కందరె యందరందరే.

తా॥ కొందరు అర్జునుని జెండామీద ఉండేవారు అనగా కోతులవంటివారు. కొందరు యముని వాహనాల వంటివారు అనగా దున్నపోతులు. కొందరు భైరవుని గుర్రాలు అనగా కుక్కలవంటివారు. కొందరు యీశ్వరుని వాహనముల వంటివారు అనగా ఎద్దుల వంటివారు కొందరు శ్రీకృష్ణుని జన్మకాలమందు కూసినటువంటివారు అనగా గాడిదెలవంటివారు. మొత్తముమీద అందరూ ఇంచుమించుగా సరిసమానులే

---

"ఒకసారి ఒక గొప్ప చిత్రకారుడు పువ్వుల బొమ్మలు వేశాడట. ఎంత వాస్తవికంగా వేశాడంటే వాటిని చూసి నిజమైన పువ్వులనుకుని కొన్ని వేలు, కొన్ని లక్షలు తుమ్మెదలు ఇంట్లోకి జొరబడి ఆ బొమ్మలమీద మూగాయట వాటిని తోలెయ్యటానికి ఎంతో కష్టపడ్డాడట"

"నేను నమ్మను,"

"ఏమిటి? అటువంటి ఆర్టిష్టులు లేరంటావా?"

"ఉండచ్చు. కాని అంత తెలివితక్కువ తుమ్మెదలుండవు"